క్లుప్తంగా

ఎల్‌ఓసీని అందజేసిన ఎమ్మెల్యే



అలంపూర్: ఇటిక్యాల మండలం రాజశ్రీ గార్ల పాడుకు చెందిన చిన్న భీమన్నకు ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం రూ.2లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజేయుడు కర్నూల్ జిల్లాలోని చల్లా నివాసంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, తిమ్మారెడ్డి, అనిల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అలంపూర్: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని సబ్‌స్టేషన్ పరిధిలో బొంకూరు ఫీడర్‌ను మరమ్మతులు చేయడం, ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయడంతో పాటు, బొంకూరు గ్రామంలో విద్యుత్ సమస్యలపై విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని తెలిపారు.

పంట రుణాల వడ్డీ చెల్లించండి

మానవపాడు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని పంట రుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 31వ తేదీలోపల శాంతినగర్ బ్రాంచ్‌లో చెల్లించాలని సీఈఓ మద్దిలేటి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార సంఘంలో పంటరుణాలపై మాట్లాడారు. వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని అన్ని గ్రామాల రైతులు పంట రుణాల వడ్డీ చెల్లించాలని సూచించారు. పంట రుణాల వడ్డీ చెల్లించి సహకార సంఘం, సహకార బ్యాంక్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చెక్ డ్యాం మరమ్మతులు

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకానికి కూలీల సంఖ్య పెరుగుతోంది. చెక్ డ్యాం మరమ్మతుల పనులకు ఒక్కరోజే 200కు పైగా ఉపాధి కూలీలు రావడంతో ఇద్దరు టీఏలు అక్కడికి చేరి పనులను పరిశీలించారు. రైతులకు పంటలు లేక 100 రోజుల పనికి ఎగబడడంతో అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఉపాధి కూలీ రూ.272 ఉండడం, పనులు లేకపోవడం కలిసొచ్చిందని పేర్కొన్నారు.

మొక్కలు ఎండుతున్నాయ్..



మానవపాడు: హరితహారంలో భాగంగా మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట హరితహారం మొక్కలు నాటారు. నీటి సదుపాయం లేక అవి ఎండుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. ఎండకాలం కావడంతో ఎండతీవ్రంగా పెరుగుతోంది. అధికారులు స్పందించి మొక్కలకు నీటి సదుపాయం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వడదెబ్బకు ఆవు, ఎద్దు మృతి

గట్టు: వడదెబ్బకు ఆవు, ఎద్దు మృతి చెందిన ఘటన మండలం లోని తుమ్మలచెర్వులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు కావలి ఆంజనేయులు ఆవు, ఎద్దు అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బకు గురై ఉదయం 6:30 గంటల ప్రాంతంలో మృతి చెందాయి. వడదెబ్బ కారణంగానే పశువులు మృతి చెందినట్లు పరీక్షించిన మండల పశువైద్యాధికారి శంకరయ్య తెలిపారు. పశువుల విలువ రూ.75వేలు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం సాయం చేయాలని రైతు కోరారు.

పశువులకు టీకాలు



శాంతినగర్: వానాకాలంలో పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు శాంతినగర్ పశువైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు టీకాలు వేశారు. వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నెలో 44 మంది రైతులకు సంబంధించిన 209 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పుష్పలత తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరప్రసాద్, లతీష్, రవికిరణ్, కార్తీక్, గోపాలమిత్ర లక్ష్మన్న, ఉపసర్పంచ్ పుల్లారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రచారంలో నాయకులు

అయిజ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంగళవారం బీజేపీ నాయకులు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని పులికల్, రాజాపురం, మేడికొండ గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివారెడ్డి, భీమసేనరావ్, గోపాల కృష్ణ, సురేష్, భగత్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఉపాధి’లో వసతులు నిల్

- ఎండలో పని చేస్తున్న వైనం
- కూలీలకు టెంట్లు, ఓఆర్‌ఎస్‌లు లేవు
- పట్టించుకోకపోవడంతో కూలీల ఆవేదన



ఉండవెల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉండవెల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో ఉపాధి కూలీలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పని ప్రదేశాల్లో అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

అలంపూర్ డివిజన్‌లో 7మండలాలున్నాయి. అందులో 200కు పైగా గ్రామ పంచాయతీలు, 70 వేలకు పైగా జాబ్ కార్డులున్నాయి. కూలీల సంఖ్య 1.50లక్షలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వేసవిలో ఎలాంటి పనులు లేక చాలా మంది ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్నారు. గ్రామాల్లో హాజరు శాతం ఎక్కువగా నమోదవుతుంది. 2017 వరకు ఉపాధి కూలీలకు పలుగు, పారలు, తట్టలు ఇచ్చారు. అనంతరం వాటి సరఫరా ఆగిపోయింది. గతంలో వేసవిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సైతం కూలీలే వెంట తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. సేద తీరడానికి సమీపంలోని చెట్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. చెట్లు లేని చోట ఎండలోనే కూర్చుంటున్నారు.

సహాయకులు లేక ఇక్కట్లు..

కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సీనియర్ మేటీలే పనులు చూసుకుంటున్నారు. దీంతో ఆయా పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు సరిగా సాగడం లేదు. కొన్ని చోట్ల పాత పంచాయతీల్లో పనిచేసేక్షేత్ర సహాయకులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు ఉన్న చాలా మంది కూలీలకు ఆధార్ లింక్ కాక పనులు చేయలేకపోతున్నారు. దీంతో పాటు పాత జీపీల నుంచి కొత్త జీపీలకు మారడంతో కొంత మంది పేర్లు సాఫ్ట్‌వేరులో రెండు చోట్ల ఉండడంతో ఆధార్ అనుసంధానం కావడం లేదు. ప్రస్తుతం వచ్చిన నూతన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌తో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు.

తాగునీటి సౌకర్యం లేదు..



పని ప్రదేశంలో తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి నుంచి నీటిని తీసుకెళ్తున్నాం. ఎండ వేడికి కొద్ది సేపటికే నీరు వేడెక్కుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటినే తాగాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం తాగునీరు ఏర్పాటు చేయాలి.

– వెంకటేశ్వర్లు, ఉండవెల్లి

నీరు, నీడ కోసం ఆలోచిస్తున్నాం..

ఉపాధి పనుల వద్ద కూలీలకు నీడ కోసం గతంలో టెంట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూడా ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నాం. నీటిని గ్రామ పంచాయతీ నుంచి ఏర్పాటు చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. ఓఆర్‌ఎస్‌ను పంపిణీ చేసేందుకు వైద్యులకు అవగాహన కల్పించాం.

– నర్సింగ్‌రావ్, డీఆర్‌డీఓ

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మల్దకల్‌లో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: విద్యార్థులు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ కమలాదేవి సూచించారు. పోషణ పక్షంలో భాగంగా మంగళవారం మల్దకల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు రక్తహీనత నివారణ, పోషణలోపం తగ్గించుటకు చిరు ధాన్యాల వినియోగం వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పోషక విలువలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవపాడు: గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే అంగన్‌వాడీల లక్ష్యమని ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలో గర్భిణులకు సీమంతం, పిల్లల కు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి పౌష్టికాహారం అందించాలని సూచించారు. తల్లిపాలను మించిన ఆహారం మరొకటి లేదని, తల్లిపాలు పిల్లలకు రోగనిరోధకశక్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆస్మా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని చింతరేవులలో గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన నిర్వహించారు. సూపర్‌వైజర్ అరుణ హాజరై మాట్లాడారు. ముఖ్యంగా చిరుధాన్యాలను రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు సమకూరుతాయన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారి, వెంకటలక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం



గద్వాల అర్బన్: నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రికశివ, గౌరవ అధ్యక్షులుగా భజంత్రి బలరాముడు, ప్రధాన కార్యదర్శి వల్లూరు గోపాల్, కోశాధికారి ఆంజనేయులు ఎన్నికయ్యారు. వారికి జిల్లా కేంద్రంలోని రామాలయంలో ఎన్నికల నిర్వాహణ అధికారి పద్మయ్య ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చంద్రిక శివ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానన్నారు. తమకు అవకాశం కల్పించిన కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గానికి పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భగీరథ వంశీ, ఆలయ చైర్మన్ జానకి రాములు, తాజా మాజీ అధ్యక్షుడు నారాయణ, నెట్టెంపాడు శ్రీనివాసులు, బుచ్చన్న, అశోక్ తదితరులు ఉన్నారు.

మట్టి అక్రమ రవాణా చేస్తే చర్యలు



కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న 10 ట్రాక్టర్లు, జేసీబీని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్‌రావు వివరాల మేరకు.. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డ్ శివారు నుంచి ప్రైవేట్ స్కూల్ నిర్మాణానికి ట్రాక్టర్లు జేసీబీ సహాయంతో మట్టి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా మట్టిని తరలిస్తున్న 10 ట్రాక్టర్లు జేసీబీని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు సదస్సు విజయవంతం చేయండి



ధరూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

ధరూరు: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సును విజయవంతం చేయాలని రైతాంగ సమితి జిల్లా నాయకులు రాజన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కరపత్రాలను ఆయన రైతులతో కలిసి విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టా లు లేవని, సాదా కాగితాల ద్వారా కొన్న భూములకు పట్టాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కోవా ల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15లక్షల మంది రైతులకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అతిథులుగా ప్రొఫెసర్లు హరగోపాల్, అల్తాఫ్ జానయ్య, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఆర్ ఎస్‌వీ కన్నెగంటి రవి హాజరవుతున్నారని తెలిపా రు. కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

కేటీదొడ్డి: డబ్ల్యూటీఓ నుంచి భారత్ బయటకు రావాలని తదితర అంశాలపై ఈ నెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ తెలిపారు. మండల కేంద్రంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వి డుదల చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తి క్కన్న, రైతులు వీరేష్, పద్మారెడ్డి, వినోద్ ఉన్నారు.

ఐటీబీపీ కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



కొండేరులో కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరులో మంగళవారం ఐటీబీపీ కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ఇండో టిబెన్ బార్డర్ పోలీస్ జవాన్లు ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం కూడలిలో ప్రజలకు ఓటు హక్కుపై ఎస్ఐ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఎవరికీ భయపడకుండా తమకు ఇష్టం ఉన్నవారికి స్వేచ్ఛగా ఓటును వేసుకోవచ్చని తెలిపారు. ఎవరైనా అభ్యర్థులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఓటర్లపై దౌర్జన్యం చేసినా, ఇబ్బందులకు గురిచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఐటీబీపీ జవాన్లు, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రెండు బైకులు ఢీ : వృద్ధుడికి గాయాలు

ఉండవెల్లి: రెండు బైక్‌లు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన ఉండవెల్లి శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది స్థానికుల కథనం మేరకు.. మానవపాడు మండలం చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన వెంకటన్న ఎక్స్‌ఎల్‌పై కంచుపాడుకు వెళ్తున్నాడు. ధర్మవరం పక్కన వెంగన్నపల్లెకు చెందిన ఇద్దరు యువకులు కర్నూల్ నుంచి బైక్‌పై వేగంగా వస్తూ వృద్ధుడిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వృద్ధుడి చేయి, కాలు విరిగాయి. వెంటనే వృద్ధుడిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు యువకుల్లో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం రావడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అమరచింత: ప్రస్తుత తరుణంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ కొందరు అమాయకుల నుంచి రూ.లక్షలు దోచుకోంటున్నారని, అలాంటి సైబర్ నేరగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సురేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సైబర్ నేరాలపై యువకులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లో కొత్తగా మేకప్ యాప్ పేరిట పలువురు మోసపోయారన్నారు. జిల్లా అంతటా ఇలాంటి యాప్ ఉచ్చులో ఎందరో పడ్డారని, అలాంటి ఘటనలు ఒకొక్కటిగా వెలుగు చూస్తున్నా యని తెలిపా రు. ఉచితంగా ఎవరూ డబ్బులు ఇవ్వరని, మొ దట ఉచ్చులోకి దింపి అనంతరం ఎక్కువ డబ్బులను దోచేస్తారని వివరించారు. ఇలాంటి వాటిని నమ్మవద్దని, ఫేక్ కాల్స్‌పై తమకు వెంటనే సమాచారం అదించాలని కోరారు. మైన ర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వరాదని, తమ తనిఖీలలో చిన్నారులు బైక్ నడుపుతూ పట్టుబడితే బైక్ యాజమానితో పాటు తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ మోసాల ఘటనలు జరిగితే వెంటనే తమకు సమా చారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

‘ధరణి’పై అడిషనల్ కలెక్టర్ పరిశీలన



తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో ధరణి వివరాల సేకరణ, నమోదు కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీముద్దీన్, డీటీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల్లో తనిఖీ



ఉండవెల్లి పరీక్ష కేంద్రం లోపలికి వెళ్తున్న విద్యార్థులు



ధరూరులో పరీక్ష రాయడానికి లోపలికి వెళ్తున్న విద్యార్థులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 137 మంది హాజరైనట్లు, ప్రైమరీ పాఠశాలలో 132 మందిలో ఒకరు గైర్హాజరుకావడంతో 131 మందే హాజరైనట్లు, మైనార్టీ గురుకుల పాఠశాలలో 150 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ పరీక్షా కేంద్రాల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తనఖీ చేశారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అయిజ: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం హిందీ పరీక్షను డిపార్ట్ మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు ప్రశాంతంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ జెడ్పీ హైస్కూళ్లలో మొత్తం 986 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 11మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పహారా నిర్వహించారు.

ధరూరు: పదో తరగతి పరీక్షలు రెండో రోజు పకడ్బందీగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ధరూరులో 265 కు గాను 265 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉప్పేరులో 172కు గాను 171 మంది, మార్లబీడు సెంటర్‌లో 178కి గాను 177 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు. మొత్తం ఇద్దరు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

మానవపాడు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. హిందీ పరీక్షకు 284 మందికి గాను, 283మంది విద్యార్థులు హాజరయ్యారు.

మల్దకల్ : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో రెండో రోజు పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు శివశంకర్, జహిరుద్దీన్, శోభారాణిలు తెలిపారు. రెండో రోజు పరీక్షకు 467మందికి గాను 466మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలో పదో తరగతి హిందీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పరీక్షకు 616 మంది విద్యార్థులకు గాను 614 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి రాజు తెలిపారు. కోదండాపురం, కొండేరు పరీక్ష కేంద్రాలలో విద్యార్థులంతా పూర్తి స్థాయిలో హాజరు కాగా, ఇటిక్యాల, పదో పటాలంలో ఒక్కొక్కరు చొప్పున గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యపై స్పందించిన అధికారులు



సంకాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

అయిజ: తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మంగళవారం మండలంలోని సంకాపురం గ్రామాన్ని వివిధ శాఖల అధికారులు సందర్శించారు. అవగాహన లేకుండా అధికారులు మిషన్ భగీరథ పథకం ద్వారా ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌తో గ్రామ ప్రజలకు తాగునీరు రావడంలేదు. బోర్‌వెల్‌కు పవర్ మోటార్‌ను అమర్చి తాగునీటి సమస్యల తలెత్తకుండా ఇంతకాలం మాజీ సర్పంచ్ చూసుకున్నారు. ఇటీవల మోటార్ కాలిపోయింది. గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవడంతో అధికారులు తాగునీటి సమస్యపై స్పందించలేదు. కొత్త మోటార్‌ను కొనుగోలు చేసేందుకు సోమవారం గ్రామస్తులు గ్రామంలో ప్రజల నుంచి చందాలు వసూలు చేశారు. ఈ విషయం దినపత్రికలో రావడంతో కలెక్టర్ స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో డీపీఓ వెంకటరెడ్డి, ఎంపీడీఓ వెంకటయ్య, ఎంపీఓ నరసింహారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్‌మోహన్, ఇంట్రా ఈఈ శ్రీధర్‌రెడ్డి, గ్రిడ్ ఈఈ భీమేశ్వర్ రావు సంకాపురం గ్రామాన్ని సందర్శించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బోర్‌వెల్‌కు అమర్చేందుకు 7.5 హెచ్‌పీ మోటార్‌ను రూ.32 వేలకు కొనుగోలు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. బుధవారం గ్రామానికి అడిషనల్ కలెక్టర్ సందర్శించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్, ప్రజలు ఉన్నారు.

వెంకటేశ్వరాచార్యులకు ప్రతిభా పురస్కారం

వనపర్తిటౌన్: ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన సాహితీవేత్త వైద్యం వెంకటేశ్వరాచార్యులకు తెలుగు విశ్వవిద్యాయం ప్రతిభా పురస్కారం ప్రకటించడంపై మంగళవారం జిల్లా సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక జి ల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన ఆయన 125కు పైగా గ్రంథాలను వెలువరించారు. సంస్థానాల ఖిల్లా అయిన పాలమూరు జిల్లాలోని వనపర్తి, గద్వాల, ఆత్మకూర్, గోపాల్‌పేట్, మున్న గు సంస్థానాల సాహిత్యంపై ఆయన విశేషమైన కృషి చేశారని కొనియాడారు. దాదాపు ఆరు దశాబ్దాలుగా వెంకటేశ్వరాచార్యులు చేస్తున్న సాహితీ సేవకుగాను ప్రతిభా పురస్కారం ప్రకటించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రధాన రోడ్లు గుంతలమయం



రాజోళి: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లతో పాటు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాజోళి–శాంతినగర్ మధ్య లో బీటీ రోడ్డు పూర్తిగా వేయకపోవడంతో వా హనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్ప డం లేదు. బీటీ రోడ్డు రాజోళిలో మొదలై సరిహద్దు వరకే వేసి, వడ్డేపల్లి సరిహద్దు నుంచి రోడ్డు వేయకపోవడంతో గుంతల రోడ్డు పైనే ప్రయాణం ఇబ్బందిగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు వేయలేదని, కనీస మరమ్మతులకు నో చుకోకపోవడంతో, కనీసం ద్విచక్ర వా హనం కూడా ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. కంకర తే లి, మోకాళ్లలోతు గుంతలు ఏర్పడి ప్ర మాదాలకు అడ్డాగా మారింది. వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.